# స్వార్థ, స్వప్రయోజనములను త్యాగము చేసినప్పుడే జగత్తు సుభిక్షముగా ఉంటుంది

బ్రతికినన్నినాళ్ళు ఫలమిచ్చుటే కాదు
చచ్చికూడ చీల్చి యిచ్చు తనువు
త్యాగ భావమునకు తరువులే గురువులు
ఉన్నమాట తెలుపుచున్న మాట.

విద్యార్థులారా!

జీవితము విలువైనది. జీవితము జీవించతగినది. జీవితము ఆదర్శవంతమైనది. అట్టి జీవితములో ప్రధానమైన గుణము, త్యాగము. త్యాగమేలేక జగత్తునకు సుభిక్ష యోగమే ఉండదు. ఈనాడు జగత్తులో చెలరేగిన కష్టములకు, దుఃఖములకు విచారములకు భయభ్రాంతులకు మూలకారణము స్వార్థమే! ఈ స్వార్థము, స్వప్రయోజనము త్యాగము చేసినప్పుడే జగత్తు సుభిక్షముగా ఉంటుంది.

**మంచిని ఆదర్శముగా తీసుకుని ఆచరణలో పెట్టినవాడే నిజమైన విద్యావంతుడు**

మూడుదినములనుండి మన Institute లో Rural development అని ఒక workshop ప్రారంభించారు. ఈ Rural development అనే దానికి అర్థము ఏమిటి? దీనిని విద్యార్థులు గుర్తించాలి. 'పల్లె అనగా ఏమిటి, పట్టణమనగా ఏమిటి?' అనే విషయము గుర్తించినప్పుడే Rural development విషయము చక్కగా అర్థమవుతుంది. విశాలమైన స్థలములో విడివిడిగా కొన్ని కొన్ని యిళ్లుమాత్రమే కట్టుకొని జీవించేది ఒక గ్రామము అని, కొందరి అభిప్రాయము. స్థలము విశాలము, యిండ్లు తక్కువ. ఇక పట్టణమనగా ఏమిటి? స్థలము తక్కువ, ఇండ్లు ఎక్కువ. పల్లెలలో జనులు నివసించటానికి చక్కని వాతావరణము ఉంటున్నాది.

srisathyasaivachanamrutam

పవిత్రమైనగాలి, పవిత్రమైన జలము, పరిశుద్ధమైన జీవితము గడపటానికి పల్లెలే ప్రధానమైనవి. పట్టణములలో జలముగానీ, గాలికానీ అన్నీ మాలిన్యముతో కూడినవిగా ఉంటున్నాయి. ఇండ్లు ఒక దానికి ఒకటి సమీపముగా ఉండటంచేత గాలిలో కార్బన్‌డయాక్సైడ్ అధికముగా వస్తుంది. దానివల్ల అనేక రోగములు పట్టణములవారికే వస్తున్నాయిగానీ పల్లెలవారికి తక్కువ. అయితే సర్వులకు అవసరమైన సదుపాయములు తక్కువ. ఎట్టి నీరు మనము త్రాగాలి, ఎట్టి నీరు మనము త్రాగకూడదు అనే విచక్షణాజ్ఞానము పల్లెలవారికుండదు. అయితే పట్టణమువారికి మంచి, చెడ్డలు తెలిసినప్పటికి వారు చెడ్డనే అనుభవిస్తున్నారుగానీ మంచిది వారు ఏమాత్రము ఆశించటంలేదు. ఇది విద్యయొక్క వివేకములో ఉండిన అవివేకమే! పుస్తకములు చదవనివానికి పుడమిలో పురుగులు కనిపిస్తాయి. పుస్తకములే ప్రధానమని, చదువే మూలాధారమని నిరంతరము చదువుకునేవానికి పుస్తకములే పురుగులుగా కనిపిస్తాయి. చదువుకున్నవాడు అంతోయింతో ఆచరణలో పెట్టినవానికి జీవితమే ఒక ఆదర్శముగా ఉంటుంది. కనుక, మంచిని ఆదర్శముగా తీసుకొని ఆచరణలో పెట్టే విద్యావంతుడే నిజమైన విద్యావంతుడు. పల్లెలలో డ్రెయినేజి సదుపాయములు లేకుండాపోవటంచేత మరింత మాలిన్యముగా ఉంటున్నాయి. పవిత్రమైన భారతదేశమందు ఏ విధమైన కొరతలు లేవు. సువిశాలమైన భూములుంటున్నాయి. జీవనాధారమైన నదులు ఉంటున్నాయి. జీవనదులు ప్రవహిస్తూనే ఉన్నాయి. ప్రాచీనకాలమునందు వ్యక్తులు తమభూములు తాము సాగుచేసుకుంటూ దేశమునకు సుభిక్షమును అందిస్తూ వచ్చారు. ఆధునికయుగమందు తమ భూములు తాము సాగుచేసుకోటమే ప్రజలకు భారంగా కనిపిస్తున్నాది. టౌనులు అభివృద్ధి కావటమే కాకుండా, పల్లెలలందు Industries అని, factories అని అభివృద్ధి కావటంచేత పవిత్రమైన పల్లెలుకూడా అపవిత్రముగా మారిపోయినాయి. పంటభూములన్నీ ఫ్యాక్టరీస్‌కు, ఇండస్ట్రీస్‌కు అధిక ధరలకు అమ్మకం చేయటంచేత రైతులు పంటలు పండించుకొనటం తగ్గించుకొని భూములు అమ్ముకొని పట్టణములలో నివాసము చేస్తున్నారు. కారణం ఏమిటి? పంటకంటె అమ్ముకుంటె ధర అధికముగా వస్తున్నాది వారికి.

**ఈనాడు ప్రపంచములో ధనమే మూలాధారముగా నున్నది**



sri sathyasai vahini

ఈనాటి ప్రపంచములో ధనమే మూలాధారముగా ఉన్నాది. ధనముపై దృష్టి మరల్చుటంచేత ఆరోగ్యము క్షీణించిపోతున్నది. మానసిక బలముకూడా దినదినమునకు దిగజారిపోతున్నది. ఈనాటి పల్లెలవారికి తమ భూములు తాము సాగు చేసుకుంటూ తమ కాళ్లపై తాము నిల్చుకొని తమ గ్రామాన్ని తాము అభివృద్ధిపరచుకోటానికి తగిన ప్రబోధలు సల్పటం అత్యవసరము. ప్రాచీనకాలమందు పోతనామాత్యుడు భాగవతము వ్రాసే సమయమందు పల్లెలవిలువను, భూమియొక్క సాగును గురించి ఎంత ప్రధానముగా తీసుకున్నాడో చరిత్రయే మనకు నిరూపిస్తున్నాది. పల్లెలో పుట్టి పట్టణములో పెరిగి రాజులతో సన్నిహితసంబంధబాంధవ్యము పెంచుకున్న శ్రీనాధుడు, పోతన బావమరిదియే! తన కుమార్తెను పోతనకుమారునికిచ్చి పెండ్లి చేశాడు. ఒక రోజున పల్లెలోనే ఉండి పవిత్రమైన భగవంతుని చరిత్ర వ్రాసుకుంటూ కాలము ప్రశాంతముగా గడుపుతున్న పోతన దగ్గరకు వచ్చాడు, శ్రీనాధుడు. 'బావగారు! ఈ పల్లెలో జీవితము చాలా కష్టముగా ఉంటుంది. మీరు నాతో వచ్చి పట్టణములో నివసించండి. మీరు వ్రాసే కావ్యములన్నీ మహారాజుకు అంకితము చేయండి. మహారాజు యిచ్చే ధనముచేత మీ కుటుంబము సుఖశాంతులతో వర్థిల్లుతుంది', అని అనేక విధములుగా ప్రబోధిస్తూ వచ్చాడు. వచ్చేదారియందు తన అల్లుడైన నాగన్న భూమిదున్నుతున్న దృశ్యం కనిపించింది శ్రీనాధునికి. అప్పుడు అతడు తన అల్లుని పలకరిస్తూ 'ఏమిటోయ్! హాలికా! కుశలమేనా' అని ప్రశ్నించాడు. అందుకు పోతన సమాధానమిస్తూ ఒక్క చక్కని పద్యం చెప్పాడు:

**"బాలరసాల సాలనవపల్లవ కోమల కావ్య కన్యకన్**
**కూళలకిచ్చి యప్పడుపుకూడు భుజించుటకంటె సత్కవుల్**
**హాలికులైననేమి గహనాంతరసీమల కందమూల**
**కౌద్దాలికులైననేమి నిజ దార సుతోదర పోషణార్థమై"**

'నీలో ఆవిర్భవించిన భగవత్ప్రసాదమైన పాండిత్యమును రాజులకిచ్చి ఆ ఎత్తివేసేకూడు భుజించేదానికంటె భూమాతను, గోమాతను నమ్మి భుజించే దానికి మా క్షేమానికి ఏ కొరత లేద'న్నాడు. మన ప్రాచీనులు భూమాతను, గోమాతను, దేహమాతను, వేదమాతను

విశ్వసించి సేవించేవారు.

**జన్మనిచ్చిన తల్లిని, జీవితాన్ని పోషించే దేశమును ఎన్నటికి మరువకూడదు**

ఈనాడు మాతృభూమి, దేశభక్తిని విద్యార్థులు ఏమాత్రము గుర్తించటానికి ప్రయత్నించటంలేదు. దేహము నిచ్చిన తల్లిని, జీవితాన్ని పోషించే దేశాన్ని మనము ఏనాటికి మరువకూడదు. ఆనాడు రాముడుకూడా యిదే ప్రబోధిస్తూవచ్చాడు: 'జననీ జన్మభూమిశ్చస్వర్గాదపి గరీయసి' అని. దేనినైనా మరువవచ్చుకాని తల్లిని, జన్మభూమిని మనము మరువకూడదు. ఈనాటి మానవుడు అధికవిద్యావంతుడై పోయి దేశమును విడచి విదేశములలో జీవితాన్ని గడిపే నిమిత్తము అనేక దురాశలకు గురై దేశముయొక్క క్షేమాన్ని విస్మరిస్తున్నాడు. మాతృదేశమునే మరచినవాడు దేనిని గుర్తుయందుంచుకొనగలడు? తాను చదివిన చదువుగానీ, తాను నేర్చిన విద్యగానీ మాతృదేశములో ఉపయోగపరచి మాతృదేశమునకు సరైన అభివృద్ధిని గావించాలి. ఆనాటి పల్లెలే నేటి పట్టణములుగా ఉంటున్నాయి. మన భారతదేశములో మద్రాసు ముఖ్యమైన నగరము. పూర్వము దాని పేరు చెన్నప్ప పల్లె. ఈనాడు బెంగుళూరు గొప్ప పట్టణముగా తయారైపోయింది. వేరుసెనగకాయలు అమ్మి బ్రతికే గ్రామమది. అక్కడ 'బెన్‌గాల్' అనగా వెరుసెనగలు వేయించి అమ్ముకునేవారు. బ్రిటిషువారు దానిని బెంగుళూరుగా మార్చివేశారు. ఈ విధంగా ప్రాచీన కాలంలో పల్లెలే నేడు పట్టణములుగా తయారుకావటానికి కారణము ఏమిటి? శ్రమించే శక్తి, ఆసక్తి ప్రజలలో క్షీణించిపోయింది. అన్నింటికి సుఖము, సుఖము. ఏమిటీ సుఖము? భౌతిక సుఖమా? కాదు. మానసిక తృప్తికూడా తృప్తికాదు. ఆత్మతృప్తే తృప్తి. మానసిక సంబంధమైన ధనతృప్తికోసమని, శరీరసంబంధమైన సుఖములకోసమని ఈనాటి విద్యావంతుడు సోమరివలె తయారైపోతున్నాడు. Laziness is rust and dust. Realisation is best and rest. Realisation అంటే ఏమిటి? తనను తాను గుర్తించాలి. నేనెవరు? నేను మానవుడు.

**దేహాభిమానమును దూరము గావించుకున్నప్పుడే మనలో త్యాగము మొదలవుతుంది**

మానవుడైనవాడు చేయవలసిన పని ఏమి? The proper study of mankind is man.

తనువు, మనస్సు, వాక్కు ఏకము చేయాలి. 'పరోపకారార్థమిదం శరీరమ్'. 'పరోపకారాయ ఫలంతి వృక్షః'. వృక్షములు పరోపకారనిమిత్తమై ఫలములనందిస్తున్నవి. ఫలములు యీనాడు వృక్షము అందిస్తున్నాదంటే పూర్వము దాని స్థానము ఏమిటని గుర్తించాలి. ఒక విత్తనము భూమిలో పెట్టినప్పుడు ఆ విత్తనము తన ఆకారమును భిన్నముగావించుకొని మొక్కగా వచ్చి వృక్షముగా అభివృద్ధి పొంది ఫలములను అందిస్తుంది. తన విరోధి తనను సమీపించినా తనకు చల్లని ఛాయనిచ్చి తీయని ఫలములందిస్తున్నాది, వృక్షము. ద్వేషము, అసూయ వృక్షములకు లేవు. కారణము ఏమిటి? అది తన దేహాభిమానమును చంపుకుంది. ఆ బీజముయొక్క స్వరూపమును భిన్నము చేసుకొంది. అప్పుడే వృక్షముగా తయారైంది. ఆ విధంగా దేహాభిమానమును దూరము గావించుకున్నప్పుడే మనలో నిజమైన త్యాగము ప్రారంభవుతుంది. ఈనాడు దేహాభిమానము, ధనాభిమానము మొదలగు ఈ అభిమానములతోనే మానవుడు కట్టుబడి ఉండడంచేత త్యాగము అనేది అత్యంత దూరంగా పోయింది.

**శరీరము వచ్చినది పరోపకారము నిమిత్తమే!**

'పరోపకారాయ వహంతి నద్యః' నదులు ప్రవహిస్తున్నాయి. కాని, తమ జలమును తాము గుక్కెడైనా మ్రింగటంలేదు. చెరువులంతా నింపి జనులకు త్రాగటానికి, పంట పండించుకొనుటకు నీరు యిచ్చి ఉపకారము చేస్తూ వస్తున్నాయి. 'పరోపకారాయ దుహంతిగావః'. పరోపకారము నిమిత్తము గోవులందు క్షీరము అభివృద్ధి అవుతున్నాది. తమ క్షీరమును తాము ఒక్క చుక్కైనా త్రాగటంలేదు. అంతా పరోపకారార్థమే! వృక్షములకు యీనాడు త్యాగము, పరోపకారము ఉంటున్నాది. నదులకు యీనాడు త్యాగము, పరోపకారము ఉంటున్నాది. పశువులకు త్యాగము, పరోపకారము ఉంటున్నాది. ఇంత తెలివి తేటలుండి యిన్ని విద్యలు అభ్యసించి, యింత అధికారముండి కీర్తి ప్రతిష్ఠలు సంపాయించిన మానవునియందు యీ తెలివితేటలు, యీ త్యాగము ఏమాత్రములేవు.

**వృక్షజాతులు, పశువులు పక్షులు**

sri sathyasaivachanamrutam

## పూర్ణత్యాగమందు పుట్టి పెరిగె

పశువులుగానీ, పక్షులుగానీ, వృక్షములుగానీ పూర్ణమైన త్యాగములో పుట్టి పెరుగుతున్నాయి. ఇంత చదువులు చదివి యింత తెలివితేటలుంటుండి మానవునికి యీ విధమైన త్యాగభావముగానీ, విశాలహృదయముగానీ లేకపోవటం చాలా విచారకరము. విశాల ప్రపంచములో పుట్టి సంకుచితమైన మనస్సు కల్గిఉంటున్నారు, మానవులు. విశాల ప్రపంచములో పుట్టినవానికి విశాల భావములే రావాలి. కాని, ఈనాడు మానవులలో విశాలత్వమే లేదు. ఎన్ని చదువులు చదివి, ఏమి ప్రయోజనము? ఎంత తెలివి ఉండి ప్రయోజనము ఏమిటి? పరోపకారనిమిత్తమే ఈ శరీరము రావటము.

## పల్లె ప్రజలు అనారోగ్యమునకు గురికావటానికి అశుభ్రతయే మూలకారణము

మన భారతదేశమును మనము యిష్ట పడాలి. ఎత్తైన పర్వతములు, పెద్ద పెద్ద జీవనదులు, సస్యశ్యామలమైన భూములు యిలాంటి భారతదేశమును మనము ఆశించలేకపోతున్నాము. యిలాంటి భారతదేశమునకే మనము సేవలు చేయలేక పోతున్నాము. ఇంక చదువులు దేనికోసమని? వెనుకబడిన పల్లెలలకు పోయి సేవలో ప్రవేశించాలి. మొట్టమొదట పల్లెలకు రహదారి నిర్మించాలి. దాని తరువాత వారికి పరిశుద్ధమైన జలమునందించాలి. మురికి కాలువలు సరైన అనుకూలముగా ఏర్పరచాలి. చీకటిలో నివసించే గ్రామాన్ని వెలుతురుగా మనము ప్రకాశింప చేయాలి. ఈనాటి పల్లె ప్రజలు అనారోగ్యమునకు గురికావటానికి అశుభ్రతయే మూలకారణము. మొట్టమొదట వారు త్రాగేనీరు పరిశుద్ధముగా ఉంటుండాలి. ఆయొక్క స్థలమును మనము పరిశుద్ధము చేయాలి. పరిశుద్ధ పరిసరములను కల్పించటమే పల్లెలలో ప్రధానమైన సేవ. దీనిని చాటే నిమిత్తమే సాయి ఆవిర్భవించాడు. ఏమిటి 'సాయి' అనే పదమునకు అర్థము? SAI సాయి. S-Service, A-Association, I-Individual. Individual అయినవాడు సమాజక్షేమము అభివృద్ధిగావించాలంటే సేవ చేయాలి.

## వ్యక్తిలో పరివర్తన వచ్చినప్పుడే సమాజములో పరివర్తన వస్తుంది

మానవుడు ఈనాడు అభివృద్ధి చేయవలసినది ఏమిటి? తన వ్యక్తిత్వమును విశాలము



sri sathyasai vahamrutam

గావించుకోవాలి. వ్యక్తియొక్క తెలివితేటలను పెంచుకోవాలి. తదుపరి సమాజముయొక్క శక్తిని పెంచుకోవాలి. సమాజముయొక్క పవిత్రతనుకూడా అభివృద్ధిపరచుకోవాలి. తదుపరే మనము ఆధ్యాత్మికతను అభివృద్ధి పరచుకోవచ్చు. SAI వెనుకనుంచి చదివినప్పుడు IAS అవుతుంది. I-Individual. వ్యక్తిలో మార్పు కలగాలి. Individual transformation జరిగిన తరువాత Association transformation అవుతుంది. Association transformation జరిగినప్పుడు Spiritual transformation అప్రయత్నముగా వస్తుంది. మొట్టమొదట వ్యక్తిగతంగా శక్తిని మనం పెంచుకోవాలి. దీనికే సాయి అన్ని సంస్థలకు ప్రబోధిస్తున్నాడు. సాంఘికము, సాంస్కృతికము, సనాతనము. ఇవి మూడు ప్రధానము. ఈ మూడింటిని ఆధారము చేసుకున్నవాడే నిజమైన మానవుడుగా తయారుకాగలడు. మూడింటిని వదలి యింకొక దానిలో ప్రవేశించకూడదు.

### శ్రీ సత్యసాయిబాబా అంటే సాంఘికము, సాంస్కృతికము మరియు సనాతనము

శ్రీ సత్యసాయిబాబా పేరులో మూడు S లు ఉన్నాయి. దీనిలో మొదటి S సాంఘికము Society service. రెండవ S సాంస్కృతికము. చిత్ర, శిల్ప నృత్య, సంగీత, సాహిత్యములనే కళలను మనం అభివృద్ధిచేసుకోవాలి. వీటినే లలితకళలు అంటారు. ఇది సాంస్కృతికము. మూడవ S సనాతనము. ఆత్మజ్ఞానమునకు పవిత్రతను మనం పెంచుకోవాలి. మానవుడు పుట్టింది, యీ మూడింటికోసమనే! సాంఘికము, సాంస్కృతికము, సనాతనము. ఇలాంటి పవిత్ర ఆదర్శముల నిమిత్తమై పుట్టిన మానవుడు ఈ మూడింటిని విస్మరిస్తున్నాడు. B-Black money చేస్తున్నాడు. ఇదేనా మానవుని జీవితము? ఇదికాదు. ఈ మూడింటిని తప్ప మిగతాదాన్ని block చేయి. అదే శ్రీ సత్యసాయిబాబా SSSB. ఈ Institute లో చదివిన విద్యార్థులు పల్లెలలో ప్రవేశించాలి. చాలామంది పట్టణములనుంచి వచ్చి చేరిన పిల్లలకు పల్లెల సంగతే తెలియదు. పల్లెలనుంచి వచ్చిన పిల్లలు విద్యనభ్యసించిన తరువాత పట్టణములలో స్థిరపడిపోకూడదు. నీ పల్లెను నీవు అభివృద్ధి పరచుకో! ఎందుకంటే, నిన్ను పుట్టించి పోషించి పెంచినది ఆ పల్లెయే! మనకు జన్మనిచ్చి పెంచి పోషించిన పల్లెలను మనం వదలకూడదు.

### మీ స్వశక్తిపై ఆధారపడి స్వయంకృషితో పల్లెలను అభివృద్ధిపరచాలి

srisathyasaivachanamrutam

మొట్టమొదట నీ పల్లెను నీవు అభివృద్ధి చేసుకోవాలి. తరువాత పంటలను అధికంగా పండించుటకు ప్రయత్నించాలి. ఎందుకంటే రెక్కలాడితే డొక్కలాడుతాయి. పని చేస్తూ వస్తే తిండికేమీ తక్కువ ఉండదు. ఈనాటి విద్యార్థులు పనికి ఏమాత్రము నడుము వంచరు. కానీ, తిండిమాత్రం సుఖంగా జరగాలి. 'తిండికి తయారు, పనికి పరార్!' ఎవరు? సోంబేరి. 'పనికి తయార్, తిండికి పరార్!' అది కావాలి, మనకు. యీనాడు తిండి కావలసిందే! ఆ విధమైన జీవితమును విద్యార్థులు చేపట్టాలి. అనేకమంది అనుభవజ్ఞులు అంతా వచ్చి చేరారు. రెండుదినములు మీకు చక్కగా బోధలు చేశారు. కానీ, యివన్నీ గవర్నమెంటు లెవెల్‌లో జరుగవలసినవి. అయితే, గవర్నమెంటు లెవెల్‌లో జరుగవలసినవి ఒక్కటైనా జరగవు. అన్నీ ప్లానులతో సరిపెట్టటం జరుగుతుంది. కాగితము మీద ప్లానులు తప్ప, ప్రాక్టికల్‌గా అమలు జరిగేవికావు. అందువల్లనే పనులదగ్గరకు వచ్చేటప్పటికి, ఓడిపోతున్నారు. ఒక్క చిన్న ఉదాహరణము మీరు తీసుకోండి. పల్లెలలో Block development అని పెట్టారు. దానికొరకు కొంత ధనము యిచ్చారు. కొన్ని కొన్ని స్థానములలో top వరకు గోడలు కట్టారు. ఈ లోపల ఆఫీసరు మారిపోతాడు. కొత్త ఆఫీసరు వచ్చి అసలు ఆ Project నే cancel చేస్తాడు. దానివల్ల ఆ పథకము ఎప్పటికి అట్లానే నిలచిపోతుంది. దీనివల్ల ఎంత ధనము వ్యర్థమై పోతున్నాది! ఏమి success చేస్తున్నారు, వీరు? ఏమీ లేదు. కడకు Block development అనేది Black development అయిపోతున్నాది. ఏ ఒక్క పథకమును సరిగా ప్రభుత్వము చేపట్టి పని పూర్తి చేయటములేదు. కాబట్టి, గవర్నమెంటుపై మీరు ఏమాత్రము ఆధారపడకూడదు. మీ స్వశక్తిపై మీరు ఆధారపడి స్వయంకృషితో పల్లెలను అభివృద్ధి పరచాలి. గ్రామములను అభివృద్ధిపరచినప్పుడే తిండి తీర్థాదులకు ఎట్టి కొరతలు ఉండవు. ప్రజలు దీర్ఘాయుష్మంతులై బ్రతుకగలరు. యీనాడు ఆ దీర్ఘాయుష్షుకూడా లేదు. ప్రాణము ఎప్పుడు ఏ నిమిషములో ఎక్కడ పోతుందో! కనుక, మొట్టమొదట మనము ఆరుమంది సలహాదారులను తీసుకోవాలి. ఆ ఆరుమంది సలహాదారులు మన ప్లానును success చేస్తారు. వారు ఎవరు? ఎప్పుడు, ఎందుకు, ఎక్కడ, ఎట్లా, ఎవరు, ఏవిధంగా అనేవే ఆ ఆరుమంది సలహాదారులు. వీరు గనుక సరిగా పనిచేస్తే మన ప్లానులు అన్నీ success అయిపోతాయి.

sri sathyasai vachanamrutam

## వ్యక్తికి దేశమెంత ప్రధానమో సమిష్టికి దేశమంత ఆధారము

మొట్టమొదట ఎందుకు, ఎప్పుడు, ఏవిధంగా, ఎవరు యివన్నీ మనం తెలుసుకుంటూ రావాలి. ఒక చిన్న ఉదాహరణము. ఎచ్చట, ఎక్కడ? నేను ప్రశాంతినిలయములో ఉన్నాను. ఎక్కడున్నావు? ప్రశాంతినిలయము ఎచ్చట? ప్రశాంతినిలయములో ఉన్నావు; ఎచ్చటున్నావు? ఫలానా block లో ఉన్నాను. ప్రశాంతినిలయములో ఉన్నానని చెప్పినంత మాత్రమున యింటికి రాడు. ఫలాన block అని, అది ఎచ్చట అనికూడా చెప్పాలి. ఎక్కడ, ఎచ్చట ఒకటే అయినా వ్యత్యాసము ఉంటున్నాది. ఈ విధంగా ప్రశ్నించుకుంటే మనం పట్టినవన్నీ సక్రమంగా జరిగిపోతాయి. కాన విద్యార్థులు ముఖ్యంగా మన దేశాభివృద్ధి కోరాలి. వ్యక్తికి దేహము, సమిష్టికి దేశము. వ్యక్తికి దేశమెంత ప్రధానమో సమిష్టికి దేశమంత ఆధారము. నీటి విషయములో చాలా చర్చలు జరుగుతున్నాయి. త్రాగే నీటికోసమని, పంటనీటికోసమని అనేక విధములైన తర్జన భర్జనలు జరుగుతున్నాయి. అయితే జీవితమంతా discussion అవుతున్నాదిగానీ ఎప్పుడు practical లో పెట్టటం? జీవితము ఏమిటి అని తెలుసుకునే లోపలనే మరణిస్తున్నాది దేహము. తెలుసుకున్నవి ఒకటి రెండైనా మనం practical లో పెట్టి నిరూపించాలి. దైవానుగ్రహము దండిగా ఉంటున్నాది. దానికితోడు మనిషి ప్రయత్నంకూడా అవసరము. అది లేకపోతే ఏమీ ప్రయోజనముండదు. కానీ మానవుడు ఈనాడు తన హృదయము నిండుగా thoughts పెట్టుకున్నాడు. ఎట్టి thoughts? Positive thoughts కాదు Negative thoughts. తాను, తనవారు, తన కుటుంబము. అంతా 'తన' తత్వమే పెట్టుకుంటున్నాడు. ఈ 'నేను' అనే అహంకారము పోవాలి. 'నాది' అనే మమకారము పోవాలి. 'లోకమందరిది, మనది'. ఈ రెండు భావాలు మనం అభివృద్ధి పరచుకోవాలి. భారతదేశము నాది అని చెప్పటానికి వీలులేదే? మనది. అందరిది. ఈ అందరి ఏకత్వము మనము అభివృద్ధిపరచుకుంటూ వస్తే దివ్యత్వము క్షణములో మనం అనుభవించవచ్చు.

## పంచభూతముల వృత్తియే ప్రవృత్తి

ఈనాడు సంస్థలు ఏర్పరచుకోటానికి కారణము ఏమిటి? అందరియందున్న దైవత్వము

srisathyasaivachanamrutam

గుర్తించండి. దేహములు వేరు వేరున్నాయి. తలలు వేరు వేరుగా ఉన్నాయి కానీ, ఆత్మ ఒక్కటే! ఇక్కడ రెండు పరిస్థితులు మీరు యోచించుకోవాలి. Heart ఒకటి, art ఒకటి! ఈనాటి మానవులు art నే అనుసరిస్తున్నారు, art అంటే బహిర్ముఖమైనది; art అంతా తననుండి పుడుతున్నాది. తననుంచి పుట్టేది ఏమిటి? అదే ప్రవృత్తిగుణములు. పంచభూతముల వృత్తియే ప్రవృత్తి. కామక్రోధలోభ మోహమదమాత్సర్యములన్నీ తననుంచి పుట్టినవే! తననుంచి పుట్టేవన్నీ ప్రవృత్తి లక్షణములే! ఇవన్నీ నెగిటివ్స్. మానవునకు రెండు చాలా అవసరమైనవి. ఒకటి తల, రెండవది హృదయము. అయితే, హృదయమునుండి పుట్టేది దయ, సహనము, సానుభూతి, ప్రేమతత్త్వము. Physical heart శరీరములో left side ఉంటున్నాది. Spiritual heart right side ఉంటున్నాది. Right is always right; left side heart, only left. ఎప్పుడు వెళ్లిపోతుందో తెలియదు. వదలిపోవటమే దాని స్వభావము. వదలిపోయేదానిని మనం గట్టిగా పట్టుకోకూడదు. నిరంతరముగా ఉండే Spiritual heart ని తీసుకోవాలి. లోపల దానిని చూచేది heart. బయట దానిని చూచేది art. ఈనాడు art పైననే దృష్టి పెట్టి జీవితమంతా గడుపుతున్నారు. గానీ heart యొక్క సత్యమును గుర్తించుకోలేకపోతున్నారు. Heart లేక art ఎక్కడనుండి వచ్చింది? Art came from heart. ఈ art అంతా heart నుంచే వచ్చింది. కనుక, ఆధ్యాత్మికమును లక్ష్యములో పెట్టుకోవాలి. దివ్యమైన భావాన్ని right side గా భావించుకున్నప్పుడే ఎప్పటికి శాశ్వతముగా ఉంటుంది.

**అందరియందున్న ఆత్మతత్త్వము ఒక్కటే!**

ఆధ్యాత్మిక జీవితాన్ని గడిపిన మహనీయులయొక్క చరిత్రలను నేటికికూడా అందరు స్మరిస్తున్నారు. కనుక spiritual heart పై జీవితాన్ని ఆధారపెట్టుకోవాలి. అందరికి ఉన్నది అది ఒక్కటే! కనుకనే అందరికి సహాయము చేయాలనే భావము ఆవిర్భవించింది. అది ఎవరికో కాదు, తనకు తాను చేసుకోటమే! ఒక్కతూరి కన్నులు మూసుకొని విచారించు. 'నేను భుజిస్తున్నాను' అని చెపుతావు. ఎవరికోసం భుజిస్తున్నావు? విచారణ చేయి. 'నీ కోసమే భుజిస్తున్నావు' అని సమాధానం వస్తుంది. ఈ దేహానికి జబ్బు చేసింది. మందు తింటున్నావు. ఈ మందు ఎవరికోసం తింటున్నావు? 'నా కోసమే తింటున్నాను' అని



srisathyasaivachanamrutam

జవాబు వస్తుంది. అదే విధముగా అందరియందు ఉన్నది ఒక్కడే అయినప్పుడు ఎవరికోసం చేస్తున్నావు సేవ? నీ కోసమే చేస్తున్నావు. కనుక, నీకు నీవు చేసుకుంటున్నావు. కానీ పరాయివాడనుకోటంచేత వానికి దూరమైపోతున్నావు. నీకంటె తాను పరాయివాడనుకుంటే నీవు చాలా దిగువస్థాయిలో ఉన్నట్లు లెఖ్ఖ! ఇంతేకాదు, ఇది సంకుచితమైన భావము. అందరియందున్న ఆత్మతత్త్వము ఒక్కటే! ఆ ఆత్మయే ఈ ఆత్మ, ఈ ఆత్మయే ఆ ఆత్మ. ఈ ఆత్మ దేహములో అణువణువుగా వ్యాపించి ఉంటున్నది. కనుక, ఆత్మభావముతో సేవ చేస్తూరావాలి. అప్పుడు అన్ని కార్యములు జయప్రదమవుతాయి. మొట్టమొదట ఒక దానిని సాధించుకుంటూ రా. ఆ ఒకటి success అయ్యేనా అన్నీ success అయిపోతాయి. నీవు success కావాలంటే అందరియందున్న ఆత్మభావాన్ని ఏకత్వంగా భావించాలి. ప్రపంచములో యింక ఏ Institute గానీ University గానీ ఇంతటి విశాలభావముతో పని చేయడంలేదు.

## భగవత్ప్రేమను కించిత్తైనా సాధించినప్పుడు జగత్తంతా మనకు హస్తగతమై పోతుంది

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! మా సంస్థలో మీరు ప్రవేశించి యీ Institute students అని పేరు పొంది ఈ Institute యొక్క ఆశయాలను మీరు తప్పక ఆచరిస్తారని నేను ఎంతో ఆశిస్తున్నాను. ఏదో పెద్ద పెద్ద సమస్యలంతా పట్టుకొని సాధించటానికి వీలుకాదు. చిన్నదానియందే ఉంటున్నది పెద్దది. విత్తనము చాలా చిన్నది. క్రమంగా పెరుగుతూ పోతే చాలా పెద్దదై పోతుంది. ఇంత పెద్ద వృక్షములోకూడా చిన్న విత్తనము దాగి ఉన్నది. దీనినే ఆధ్యాత్మికములో 'అణోరణీయాన్ మహతో మహీయాన్' అన్నారు. ఆ భగవత్ప్రేమకు కించిత్ మనము పాత్రులమై పోతిమా, జగత్తంతా మనకు హస్తగతమై పోతుంది. ఆ చిన్న నీటిచుక్కవంటిదే విశాలమైన దైవత్వముకూడా', సముద్రము చాలా పెద్దగా ఉంటున్నాది. కానీ 'సముద్రము నీటి రుచి ఎట్లుంది?' అని ప్రశ్నించినప్పుడు జవాబుకొరకు సముద్రము నీరంతా త్రాగవలసిన అవసరం లేదు. ఈ విశాలమైన సముద్రముయొక్క రుచి ఒక్క నీటిచుక్కద్వారా తెలుస్తుంది. అదే రీతిగా భగవత్ప్రేమ ఒక్క నీటిచుక్కవంటిది. ఆ పవిత్రమైన అమృతము తీసుకుంటే సంపూర్ణభగవత్‌తత్త్వము యిట్టిది అని అర్థమవుతుంది. దీనినే

srisathyasaivahini.. sri sathyasai vacharamrutam

అమృతము అన్నారు. దానిని అనుభవించిన వారిని 'అమృతస్యపుత్రాః' అన్నారు. ఈనాడు పంచభూతములలో ఏది ప్రధానమైనది అని అడుగుతే 'పర్సు' అని చెబుతారు. 'పర్సు' పంచభూతములలో ఒకటి, మిగతా భూతములు లెక్కలేదు. పర్సు ఒక్కటి ఉంటే చాలు అనుకుంటారు. పంచభూతములలో పర్సా ప్రధానము? ప్రాణము, ప్రధానము.

**భగవంతుడు ధనముతో తూగడు**

ప్రాణము లేక పర్సు ఉంటే ప్రయోజనము ఏమిటి? కావలసిన ధనము ఉంటున్నాది. ఈ ధనమునకు రెక్కలుంటున్నాయి, ఎక్కడకు కావలసినా పోతుంది. ప్రపంచమంతా చుట్టివస్తుంది. కానీ భగవంతుని దగ్గరకు మాత్రం తీసుకువెళ్లదు. యింక ఎన్ని చోట్లకైనా తీసుకువెడుతుంది. భగవంతుని దగ్గరకు మాత్రం తీసుకువెళ్లదు. సత్యభామ ప్రధానపాత్రగా ఉన్న ఒక చక్కని కథ. ఒక సందర్భంలో కృష్ణుని అమ్మకానికి పెట్టాడు, నారదుడు. కృష్ణుడు తనవాడుగానే ఉండాలి అనే స్వార్థభావముచేత సత్యభామ కృష్ణుని కొనటానికి ప్రయత్నించింది. కారణం ఏమిటి? తన దగ్గర శమంతక మణి ఉంటున్నాది. కావలసిన ధనము అభివృద్ధి అవుతుంది దినదినమునకు. ఆ ధనము వేసి తూచి కృష్ణుని తనవాడుగా చేసుకోవచ్చుని స్వార్థబుద్ధి అభివృద్ధిపరచుకుంది, సత్యభామ. కాని, ధనముతో భగవంతుడు తూగలేదు. కావలసినంత ధనము వేసింది. నగలన్నీ వేసింది. కించిత్తైనా కదలలేదు కృష్ణుడు. ఎందుకోసము ఈ పని చేశాడు కృష్ణుడు? ఆయన నటనసూత్రధారి. భగవంతుడు ధనముతో తూగడు అనే సత్యమును చక్కగా బోధించే కోసము ఆయన ఈ విధంగా నటించాడు. చివరకు రుక్మిణి వచ్చింది.

**పత్రమో పుష్పమో ఫలమో తోయమో**
**భక్తి కలిగినవానికి వశుడవగుట**
**సత్యమేని కృష్ణా! నీవు ఈ తులసీ**
**దళమునకు తూగదువుగాక!**

అని భక్తితో ప్రార్థించి ఒక తులసిదళమును త్రాసులో ఒక పళ్ళెములో వేసింది. ఇక్కడ పత్రమంటే బిల్వపత్రమో, మారేడుపత్రమో కాదు. దేహమే ఒక పత్రము. ఎందుకనగా ఈ

srisathyasaivachanamrutam

పత్రము మూడు దళములతో చేరి ఉంటున్నాది. అవే సత్త్వ, రజ, తమోగుణములు. ఫలమో! ఏమిటి ఈ ఫలము? మనోఫలము. ఈ మనోఫలము చాలా మాధుర్యమైన ఫలము. కానీ, మనస్సు దేహాన్ని అనుసరించటంచేత మాధుర్యమంతా పుల్లగా మారిపోతున్నాది. చేదుగా మారిపోతున్నాది. ఇక ఫలము అనగా మనోఫలము. పుష్పమో! ఏ పుష్పము? వాడిపోయే ప్రకృతిలో పూచే పుష్పము కాదు. మల్లెపుష్పము, చంపకపుష్పము యివికావు. హృదయపుష్పము. తోయమో! ఏ గంగా జలమో, గోదావరీ జలమో కాదు. కంటిధార, జలము. అలాంటి దీనికి భగవంతుడు వశమైపోతాడు. దేహాన్ని అర్పితము చేయాలి. మనస్సును అర్పితము చేయాలి. హృదయపుష్పమును అర్పితము చేయాలి. ఆనందబాష్పములతో కడగాలి. అటువంటి భక్తునికి భగవంతుడు వశుడైపోతాడు. ఎంత యథార్థము, ఎంత పవిత్రము, ఎంత శుద్ధము! ఈనాడు అట్లాకాదు. దేహాభిమానము పెట్టుకొని, ఆత్మాభిమానము విస్మరించి, అన్నీ కావాలని ఆశిస్తున్నాడు మానవుడు. భగవంతుడు అంత పిచ్చివాడు కాదు. 'నీవు ఏ భావముతో చేస్తున్నావు, ఏమి చింతిస్తున్నావు, ఎలాంటి పరిశుద్ధమైన భావముతో భావిస్తున్నావు', అని చూస్తాడు. 'నేను Ph.D. చేశాను, M.Sc. చేశాను, MBA చేశాను, MFM చేశాను', అనే ఆశ మీరు పెట్టుకోకండి! ఎందుకంటే, నీకంటే నాలుగు కాగితాలు ఎక్కువ చదివినవాడే భగవంతుడు. తక్కువ చదివినవాడు కాదు.

### భగవంతుడు ఒక్క ప్రేమకు మాత్రమే వశుడవుతాడు

భగవంతుని ధనముతో కొనటానికి వీలుకాదు. యింకే విధమైన దానితో కొనటానికి వీలుకాదు. యుక్తితో వీలుకాదు. కేవలము ఒక్క ప్రేమకు మాత్రమే తాను లభించగలడు. దానికి మాత్రమే చిక్కగలడు. కనుక, హృదయాన్ని మొట్టమొదట పవిత్రము చేసుకోవాలి. హృదయము పవిత్రము చేసుకుంటే బాధపడేవారిని చూచి నీలోకూడా ఆ బాధ ప్రారంభమవుతుంది. ఆ బాధయే సర్వులకు సహాయకర్మలాచరిస్తుంది. పంటలుంటున్నాయి, పల్లెలలో. ఈ పంటలను అనేక రకములైన పురుగులు వచ్చి పాడుచేస్తూంటాయి. దానికి తగిన ఔషధములు మనం వేసుకోవాలి. వాటిని తెప్పించి

sri sathyasai vahini amrutam

చల్లాలి. తగిన ఆదాయము వచ్చేటట్లు చేయాలి. నీకు ఈ దేహాన్ని ఇచ్చి ప్రపంచమునకు ఎందుకు పంపించాడు? పరోపకారార్థము. నీకోసం నిన్ను పంపించలేదు. పరులకు సేవచేసే నిమిత్తమై పంపించాడు. కాబట్టి 'నేను సేవకుడు కావాలి' అని ప్రతి ఒక్కరూ భావించాలి. 'దాసాను దాసుడు కావలెనురా. నేను దాసులకు సేవనే చేయవలెరా' అనుకోవాలి. నేను దాసానుదాసుడను కావాలి. ఎందుకోసం దాసుడు కావాలి? మొట్టమొదట నీవు దాసుడవు అనుకుంటే భగవంతునికి దాసుడవు అవుతావు. 'దాసోహం'. ఈ దాసోహంలోపల భగవంతునికి అర్పితమై పోతావు. అలా అర్పితమైనప్పుడు 'ద' తీసివేస్తావు. అప్పుడు 'సోహం' మిగిలిపోతుంది. నీవే భగవంతుడైపోతావు. మొట్టమొదట భగవంతుడికి దాసుడు కావాలి. దాసత్వం పోతుంది. సోహం తత్త్వం నిల్చిపోతుంది. కాబట్టి, జనులు భగవంతుని సృష్టిలో మెంబర్సే! వారి సేవ నీవు చేస్తూ రా. క్రమక్రమేణా నీవే సోహంగా మారిపోతావు. కాన, మనం పల్లెలలో ప్రవేశించి పల్లెలవారి అవస్థలను, పల్లెలవారి అనానుకూలములను చక్కగా విచారించి, గుర్తించి దానికి తగిన సదుపాయములు కలిగించే సేవలో మనం పాల్గొనాలి. నీవు పరులకు సేవ చేస్తే భగవంతుడు నీకు చేస్తాడు ఉపకారము, తప్పక. ఇందులో ఏమాత్రము సందేహము లేదు. నీవు పరులకు ఉపకారము చేయి. నీకు భగవంతుడు చేస్తాడు. నీవు ఎవరికీ చేయకపోతే భగవంతుడు నీకుమాత్రము ఎట్లా చేయగలడు? 'ఆ దేహములోనున్న నన్ను ద్వేషిస్తున్నాడు కాబట్టి వీడికి ఏమాత్రము సహాయము చేయకూడదని' భగవంతుడుకూడా సంకల్పిస్తున్నాడు. దేహములు వేరు, వేరుగా ఉంటున్నాయి. కనుక, ముందుగా ఈ దేహాభిమానము కట్టిపెట్టి ఆత్మాభిమానము అభివృద్ధిపరచుకుంటే ఈ సమత్వమనే భావము సర్వులందు అభివృద్ధి అవుతుంది.

**సాయితత్త్వము తెలుసుకోవాలంటే మొట్టమొదట సేవలో ప్రవేశించాలి**

మొట్టమొదట మనము గ్రామానికి పరిశుద్ధమైన నీరు అందేటట్లు ఏర్పాటు చేయాలి. ఆ నీరే జీవితానికి ప్రాణము. తరువాత గ్రామ పరిశుద్ధము. పరిశుద్ధతకు మించినది మరొకటి లేదు. దానివలన ఆరోగ్యము కల్గుతుంది. ప్రజలలో ఉత్సాహమును మనం అభివృద్ధి

sri sathyasai vahini / vachanamrutam

పరచాలి. ఏమీ చదువుకోని పల్లెలలో చదువుకున్న పిల్లలు పనిచేస్తుంటే ఆ చదువులేనివారుకూడా విద్యార్థులే వచ్చి సేవలో ప్రవేశిస్తే మనముకూడా ప్రవేశించాలని ఉత్సాహపడతారు. ఈ విధంగా మనం వారికి ఉత్సాహ, ప్రోత్సాహములు అందించినవారమవుతాము. అయితే, మనం చదువుకున్నవారమని అహంకారమునకు అవకాశము ఏమాత్రం యివ్వవద్దు. ఏమిటి, మన చదువు? ఇదంతా జనసహాయంకోసం ఉపయోగించాలి. సంఘసంక్షేమము మన దృష్టియందుంచుకోవాలి. అదియే మన నిజమైన జీవితము. దీనికి భగవదనుగ్రహము సంపాయించుకోవాలి. ఆ అనుగ్రహమునకు మనము పాత్రులమైతే సర్వమును సాధించినవారమవుతాము. మొట్టమొదట సేవ. ఎవరికి? సంఘమునకు. మనం సాయి తత్త్వము తెలుసుకోవాలంటే మొట్టమొదట సేవలో ప్రవేశించాలి. అదే S-Service, A-Association, I-Individual. వ్యక్తిత్వము పెంచుకోవాలి. అప్పుడే మన జీవితము సార్థకము చేసుకున్నవారమవుతాము. మానవుడంటే కేవలము ఆకారముతో కూడినవాడు మాత్రమేకాదు. ప్రేమతో కూడినవాడు. ఈ ప్రేమ నీ యందు నిండుగా ఉంటున్నాది. కానీ దానిని దుర్వినియోగము చేసుకుంటున్నారు. దేనివల్ల? ప్రేమను దేహాభిమానములో ఉపయోగపెడుతున్నారు. కనుక, ఆత్మాభిమానముతో అర్పితము చేయి. అంతకు వెయ్యింతలు పెరిగిపోతుంది, ఆ ప్రేమతత్త్వము. అప్పుడు నీకు సర్వత్ర శాంతి, సంతోషములే వెల్లి విరుస్తాయి.

### భగవంతుని ప్రేమకు పాత్రులైతే సర్వము తానే అందిస్తాడు

విద్యార్థులారా! మీరు కేవలము ధనము అని, వ్యాపారము అని అనేక వస్తువులు అమ్మటము కాదు. యిదికాదు మనం అమ్మాల్సింది. మనలోని మంచిగుణములు అమ్మాలి. మంచిగుణములు అందరికి యివ్వాలి. ఆ మంచిగుణములు వారికిస్తే వారిలో నున్న చెడు పరిశుద్ధమైపోతుంది. ఉదాహరణకు, ఒక సబ్బు అమ్మేవాడు ఉన్నాడనుకోండి! సబ్బు చాలా మంచిదే, సుగంధముతో ఉన్నదే! పరిశుద్ధము చేయగలదు. ఆ సబ్బుతో ముఖం కడుగుకున్నప్పుడు మాలిన్యమంతా పోతుంది, ముఖము చాలా తేటగా ఉంటుంది. కాబట్టి, మంచిగుణమనే సబ్బు అమ్ము. ఇతరులలో చెడుగుణములు పోయి పరిశుద్ధంగా ఉంటారు.

మీరు అమ్మవలసినవి మంచిగుణములు. మీరు తీసుకోవలసినది ఇతరుల ఆనందమే! అదే తగిన సుంకము. నీవు ధనముకోసమని అమ్మకూడదు. హృదయము పెంచుకునే నిమిత్తమై నీవు చేయాలి. అయితే ప్రాపంచికముగా యీ వ్యాపారము ఉండవలసిందే. ఒక ఫ్యాక్టరీకి పోవాలి. అక్కడ పనిచేయాలి. వానికి సంతృప్తికరంగా చేయాలి. కుటుంబముంది, భార్యఉంది, పిల్లలున్నారు పోషించుకోవాలికదా. అయితే దీన్ని మాత్రమే లక్ష్యములో పెట్టుకోవడం కాకుండా దైవముపై లక్ష్యము పెట్టుకొని పని చేయి. అంతా దైవమే చేయిస్తాడు. అంతా తానే చూసుకుంటాడు. కుచేలుని తత్త్వము తెలుసు మీకు. ధనము అడగాలని కృష్ణుని దగ్గరకు పోయాడు. కుచేలునికి 11మంది బిడ్డలు. కృష్ణుని చూచి సర్వము మరచిపోయాడు. కృష్ణానుగ్రహమునకు పాత్రుడయ్యాడు. 'నాకు ఇది కావాలి అది కావాల'ని అడగనేలేదు. అయినప్పటికి కృష్ణుడు అన్నీ తానే అందించాడు. భగవంతుని ప్రేమకు పాత్రుడైతే చాలు, అన్నీ తానే అందిస్తాడు. అయితే ఆయన ప్రేమకు పాత్రుడయ్యే పని చేయాలికదా! దానికి అసూయ, ద్వేషము, క్రోధము యీ మూడు ఉండకూడదు. ఇవి చాలా ప్రమాదమైన గుణములు. మనని పీడించేవి నవగ్రహములనుకుంటున్నారు. కాదు కాదు; ఈ రెండు గ్రహములే మనలను పీడిస్తున్నాయి. ఈ రెండు గ్రహములనుంచి మనం దూరము కావాలి. ద్వేషము, అసూయ ఏమాత్రము లేకపోతే మీరు మంచి అభివృద్ధికి వస్తారు. కాన పిల్లలారా! ఎవరెవరికి లభించవలసిన ప్రాప్తి వారికి వస్తుంటాది. ఆ ప్రాప్తి మీరుకూడా పొందాలనుకున్నప్పుడు ప్రాప్తికి తగిన భావాలు మీలో పెంచుకోవాలి.

**చదువుతోబాటు సంస్కారము చాలా అవసరము**

చదువుతోబాటు సంస్కారము, సంస్కారముతోబాటు సాంఘిక భావములు అభివృద్ధిపరచుకున్నప్పుడే మన చదువు సార్థకమవుతుంది. చదువుతోబాటు సంస్కారము చాలా అవసరము. Negative తో బాటు Positive ఉన్నప్పుడే ఆ బల్బు వెలుగుతుంది. Positive లేకుండా Negative బల్బు పెట్టుకుంటే ఎలా వెలుగుతుంది? లేక Positive ఉండి Negative లేకపోతే ప్రయోజనంలేదు. అదీ ఉండాలి, ఇదీ ఉండాలి. రెండింటిని సమన్వయము చేసుకోవాలి. మీరు ఉద్యోగాలు చేసుకొని ధనము సంపాయించండి. కాని,

సమాజ సేవను దృష్టిలో పెట్టుకోండి. దానికోసమే మనకు భగవంతుడు రెండు చేతులు ఇచ్చింది. లేకపోతే ఉద్యోగము చేయటానికి ఒక చేయి చాలదా? రెండు చేతులలో ఒకటి రైటు, ఒకటి లెఫ్ట్. అనిత్యమైన ప్రకృతిసేవకూడా చేయి. నిత్యసత్యమైన కర్మ ఒక చేత్తో చేయి. కానీ, భగవంతుని దగ్గర రెండుచేతులు ఏకము చేయి. అప్పుడే అనేకత్వము ఏకత్వంగా మారిపోతుంది. అదియే నమస్కారము. ప్రాకృతికంగా, ఆధ్యాత్మికంగా రెండు పనులూ చేసి రెండింటి ఏకత్వమును దైవత్వమునకు అర్పించాలి. దైవచింతన చేస్తూ ప్రతికర్మ దైవకార్యంగా విశ్వసించి మీయొక్క జీవితమును ఆదర్శవంతమైన జీవితంగా మారాలని నేను ఎంతో ఆశిస్తున్నాను. Head మాత్రమే ముఖ్యము కాదు. Head అంతా పనికిమాలినవన్నీ యిస్తున్నాది. Heart ఒక్కటే మనకు పనికి వచ్చేది. అన్నీ అందిస్తుంది. Head responsibility, heart right. కనుక రైటుకు మనం fight చేయాలి. Responisbility collegeలో ఉన్నంతవరకు, hostelలో ఉన్నంతవరకు. కాలేజి వీడిన తరువాత ఏ responsibility లేదు. కానీ heart అట్లాకాదు. హాస్టలులో ఉండు, కాలేజిలో ఉండు, బజార్లో ఉండు, ఎక్కడైనా పో నీ right, rightగానే ఉంటుంది. త్రికాలాభాద్యమైన heart ను మనం అనుసరిస్తూ పోవాలి.

**(తేదీ 08-12-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini